క్లుప్తంగా

మురుగు పారి.. దుర్గంధం దరిచేరి


రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

కొందుర్గు: మండల కేంద్రంలో మురుగునీరు రోడ్డుపైనే పారుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు పేర్కొంటున్నారు. షాద్‌నగర్–పరిగి ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే మ్యాన్‌హోల్ గుంతల్లో చెత్త పేరుకుపోయి మురుగునీరు బయటికి వచ్చి రోడ్డుపై పారుతున్నాయి. దీంతో రోడ్డు దెబ్బతినడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగల బెడదతో రోగాలబారిన పడుతున్నామని, ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి


దేవాలయ సన్నిధిలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి దంపతులు

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలోని శ్రీరామచంద్రస్వామి దేవాలయంలో నవీన్‌రెడ్డి, లక్ష్మి దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. కోరిన కోరికలు నెరవేర్చే సీతారామచంద్రస్వామి స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఈ దేవాలయంలో ప్రత్యేకంగా మొక్కుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌గౌడ్, గణేశ్‌గౌడ్, నర్సింహాగౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎమ్మెల్సీగా విజయం సాధించిన నవీన్‌రెడ్డిని మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

కాంగ్రెస్ నాయకుడు మహేశ్


బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాయకులు

షాబాద్: మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లీ మహేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన చాకలి యాదయ్య(40) అనారోగ్యంతో ఈ రోజు ఉదయం మృతి చెందాడు. గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని చెప్పారు. ఇప్పటివరకు 25 కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసిన మల్లీ మహేశ్‌ను గ్రామస్తులు అభినందించారు. తాను సంపాదించిన దాంట్లో కొంత మృతుల కుటుంబాలకు ఖర్చు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత మల్లీ వెంకటేశ్, గ్రామస్తులు ఎల్.రమేశ్, ఎల్లేశ్, నందీశ్వర్, శిరాజ్, మల్లేశ్, రఘు, సుదర్‌రాజ్ తదితరులున్నారు.

సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనానికి ఉదయం నుంచే క్యూలో వేచియున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం, నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక ఉపాధి


హిమాయత్‌నగర్‌లో యూనిఫాం కుడుతున్న మహిళా సంఘాల సభ్యులు


చిన్నమంగళారంలో కుట్టిన దుస్తులను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

- మహిళా సంఘాల్లో జోరుగా దుస్తులు కుట్టుట
- మండలంలో నాలుగు కేంద్రాలు
- ఒక్కో యూనిఫాంకు రూ.75 చెల్లింపు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ద్వారా మహిళలు విద్యార్థుల యూనిఫాం కుడుతూ ఆర్థిక ఉపాధి పొందుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫాంను సకాలంలో అందించే దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మొయినాబాద్ మండలంలో మహిళా సమాఖ్య సంఘాల ద్వారా విద్యార్థుల యూనిఫాంలను కుట్టిస్తున్నారు. మండలంలో గ్రామీణ పేదరిక నిర్మూలన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్, చిన్నమంగళారం, చిలుకూరు, అజీజ్‌నగర్ గ్రామాల్లో మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు కుట్టుమిషన్ నేర్చుకున్న వారు విద్యార్థుల దుస్తులు కుట్టేందుకు ఎంపిక చేశారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో గల ఆయా పాఠశాలల్లో చదువుతున్న 4888 మంది విద్యార్థులకు యూనిఫాంలను కుడుతున్నారు. ఈ నెల 10వ తేదీ లోపు ఆయా విద్యాసంస్థలకు అందించేందుకు జోరుగా దుస్తుల కుట్టుట సాగుతోంది. ఈ నాలుగు కేంద్రాల్లో 48 మంది మహిళలు ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు దుస్తులను కుడుతూ పనులు వేగవంతం చేస్తున్నారు. ఒక విద్యార్థి యూనిఫామ్‌కు 75 రూపాయల చొప్పున ప్రభుత్వం ద్వారా అందిస్తున్నారు. మహిళలు రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 10–15 వరకు కుడుతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఈ పని ఇవ్వడం ఎంతో బాగుందని చెబుతున్నారు. ఇదే తరహాలో నిరంతరం కొనసాగేలా ఇలాంటి ఆర్థిక ఉపాధి పొందే పథకాలను మహిళలకు ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుందని పలువురు అంటున్నారు.

నిరంతరం ఉండేలా చూడాలి



మహిళా సంఘంలో ఉంటూ కుట్టు శిక్షణ రావడంతో ఆర్థిక ఉపాధి కలిగింది. ప్రభుత్వపరంగా పాఠశాలల విద్యార్థులకు దుస్తులు కుట్టే పనిని మహిళా సంఘాలకు అందించడంతో మంచి అవకాశం కల్పించారు. ఇలాంటి అవకాశాలు నిరంతరం ఉండేలా చూడాలి. – శివలీల

రోజుకు 10 నుంచి 11 కుడుతున్నాం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం యూనిఫామ్‌ల పంపిణీలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు పని కల్పించడం అదృష్టం. ఒక యూనిఫామ్ కుడితే 75 రూపాయల చొప్పున అందిస్తున్నారు. ఒక రోజుకు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తే 10 నుంచి 11 యూనిఫామ్‌లు కుడుతున్నాం. ఇది బాగానే ఉంది. – పరంజ్యోతి

త్వరలోనే పూర్తిచేసేందుకు కృషి..



మండలంలో 4888 మంది విద్యార్థులకు ఈ పాఠశాలలు పునఃప్రారంభం ముందే అందించేందుకు కృషి చేస్తున్నాం. మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిన్నమంగళారం, చిలుకూరు గ్రామాల్లో మహిళా సమాఖ్య 48 మంది సభ్యులతో కుట్టడం ప్రారంభించాం. త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ కుట్టు కేంద్రాల్లో మహిళలు ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు కుడుతున్నారు.
– రవీందర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, మొయినాబాద్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కొందుర్గు: మండలంలోని పలు గ్రామాలకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కొందుర్గు ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరంగాపూర్ నుంచి ఉత్తరాసిపల్లి సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సందర్భంగా రేగడిచిల్కమర్రి, ముట్పూర్, చుక్కమెట్, ఉత్తరాసిపల్లి, టేకులపల్లి, భైరంపల్లి, మహదేవ్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

యూనిఫాం కుట్టడంలో నాణ్యత పాటించాలి


యూనిఫాంలను పరిశీలిస్తున్న డీఆర్డీఏ ఏపీడీ సూర్యారావు

కొందుర్గు: విద్యార్థుల యూనిఫామ్ కుట్టడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఆర్డీఏ ఏపీడీ సూర్యారావు సూచించారు. బుధవారం ఆయన కొందుర్గు కుట్టు కేంద్రాన్ని సందర్శించి మహిళలతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తోంది పేద విద్యార్థులని, వారు మీ పిల్లలేనని, అందుకోసమే ప్రభుత్వం విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించిందన్నారు. పాఠశాల నిర్వహణ, అభివృద్ధి బాధ్యత కూడా మహిళా సంఘాలదేనన్నారు. విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడంతో మహిళలకు ఉపాధి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జయమాలిని, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

పెద్దేముల్: విత్తనాలు, ఎరువులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన స్టాక్, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన కొనుగోలులో రసీదులు ఇవ్వకపోతే, అధిక ధరలకు విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి విత్తనానికి ఎరువులకు రసీదులు తప్పకుండా ఉండాలన్నారు. ఎరువులు, విత్తనాలు ఎవరైనా ఎక్కువ ధరలకు విక్రయాలు చేసినట్లు ఉంటే రైతులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై విచారణ చేసి, తప్పు రుజువైతే లైసెన్స్ రద్దుతో పాటు యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. వ్యవసాయశాఖ నుంచి గుర్తింపు పొందిన షాపుల్లోనే విత్తనాలు ఖరీదు చేయాలని సూచించారు. విడిగా విత్తనాలు కొనడం మంచిది కాదని, కంపెనీ లేబుల్ ఉన్న ప్యాకెట్లను కొనాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వినయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్లలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇదే

అద్దె భవనాల్లోనే కార్యాలయాలు

- సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు స్థలం ఉన్నా..
- నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం
- సీఎం నిర్ణయంపై అధికారుల్లో ఆశలు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటిగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి ఈ కార్యాలయాలు అద్దెభవనాల్లోనే కొనసాగుతూ వస్తున్నాయి. కేవలం ఆదాయం అందించే వనరులుగానే చేసుకున్నాయే తప్పా వాటికి సొంత భవనాలు, సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన చేయలేదు. నేడు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారుల భేటీలో రాష్ట్రానికి ఆదాయ వనరులుగా ఉన్న ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు ఉండాలని భవనాలే కాదు వీటిని కార్పొరేట్ స్థాయిలో ఉండేలా చూడాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇక ముఖ్యమంత్రి స్థాయిలో తీసుకున్న ఈ నిర్ణయంతో కార్యాలయాలకు ఏళ్ల తరబడి వేధిస్తున్న అద్దెభవనాల సమస్యలు తీరనున్నాయే తెలుస్తోంది. సొంత భవనాలు రాబోతున్నాయనే వార్త అధికారులకు, సిబ్బందికి ఎంతో సంతోషాన్ని నింపుతోంది. ప్రభుత్వానికి ఎంతో ఆదాయాన్ని అందిస్తున్న ఈ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవటంపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఉట్టిపడినట్లు కన్పిస్తోంది.

రెండు అద్దెభవనాల్లోనే..

చేవెళ్ల నియోజకవర్గంలో చేవెళ్ల, శంకర్‌పల్లిలో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రెండు కార్యాలయాలు అద్దె భవనాల్లోనే ఏళ్ల తరబడిగా కొనసాగుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా రిజిస్ట్రేషన్‌లు జరిగే కార్యాలయాల్లో చేవెళ్ల, శంకర్‌పల్లి కూడా ముందు వరుసలో ఉన్నాయి. అయితే వీటికి ఇప్పటివరకు సొంత భవనాలు లేకపోవటం గమనార్హం. కార్యాలయాలకు ప్రభుత్వం స్థలాలను సైతం కేటాయించింది. చేవెళ్లలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేవెళ్లలోని కోర్టు పక్కన 9 గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించింది. శంకర్‌పల్లిలో బీడీఎల్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలంలో 20 గుంటల స్థలం కేటాయించింది. వీటికి సంబంధించిన నిధులు కేటాయించి ఉంటే సొంత భవన నిర్మాణం ఎప్పుడో జరిగేది. కానీ నిధులు కేటాయించకపోవటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిపోయింది. ఇప్పుడు సీఎం నిర్ణయంతో చేవెళ్ల , శంకర్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సొంత భవనాల ఆశలు చిగురించినట్లుగా మారాయి. సీఎం అధికారులకు సొంత భవనాలు లేని వాటికి స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించేలా చూడాలని నిర్ణయించారు. కానీ ఇక్కడ స్థలాలు ముందే కేటాయించారు కాబట్టి భవన నిర్మాణాలకు నిధులు విడుదల చేస్తే సరిపోతుందని స్థానిక ప్రజలు అంటున్నారు. ఈ కార్యాలయాలకు అద్దె భవనాలు సరిపోక పలుమార్లు భవనాలు మారుస్తూ వస్తున్నారు. సొంత భవనం ఏర్పాటుతో ఈ కార్యాలయలకు అద్దె భవనాల బాధలు తీరనున్నాయి.


శంకర్‌పల్లిలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నిధులు మంజూరు చేయాలి



చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చేవెళ్లలో మొదటి నుంచి అద్దెభవనంలోనే కొనసాగుతోంది. సీఎం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను సొంతభవనాల ఏర్పాటుతో ఆధునీకరించాలనే ఆలోచన చేయటం సంతోషకరమైనది. చేవెళ్ల డివిజన్‌లో రెండు కార్యాలయాలు కొనసాగుతున్నాయి. రెండు మండలాల్లో సొంత భవనం లేకపోవటంతో అద్దె భవనాల్లోనే కొనసాగిస్తు వస్తున్నారు. రెండింటికీ ఆయా మండలాల్లో ప్రభుత్వం స్థలం కేటాయించింది. స్థలాలు సిద్ధంగానే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేస్తే సొంత భవనం ఏర్పాటు అవుతుంది. సొంత భవనాలతో అద్దె సమస్యలు తీరుతాయి.
– విష్ణు, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్, చేవెళ్ల

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి సన్మానం

తలకొండపల్లి: మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన నవీన్‌రెడ్డిని బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం మామిడిపల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, దస్తగిరి, మహేష్, శ్రీరామ్ పాల్గొన్నారు.


నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

బీజేపీ నాయకుల సంబురాలు


కొందుర్గులో సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు

మొయినాబాద్: చేవెళ్ల పార్లమెంటుతో పాటు రాష్ట్రంలో 8 స్థానాలు, దేశంలో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడంతో బీజేపీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించాయి. మంగళవారం సాయంత్రం బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొయినాబాద్ మండల కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరూ స్వీట్లు పంచుకొని విజయోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ బీజేపీని, మోదీ ప్రభుత్వాన్ని విశ్వసించారన్నారు. అందుకే తెలంగాణలో సైతం సగం సీట్లలో బీజేపీని గెలిపించారన్నారు. బీజేపీకి ఓటు వేసి చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వరరెడ్డిని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు గున్నాల గోపాల్‌రెడ్డి, మోర నర్సింహ్మారెడ్డి, సీనియర్ నాయకులు పల్లె శేఖర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఎంపీటీసీ సహదేవ్, నాయకులు శ్రీరాములు, మల్లారెడ్డి, రాజమల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీపతియాదవ్, శ్రీకాంత్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివద్ధి పథకాలే తమ అభ్యర్థులను గెలిపించాయని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మండల అధ్యక్షుడు కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో సంబరాలు నిర్వహించారు. మండలంలోని షాబాద్, హైతాబాద్, సర్దార్‌నగర్ చౌరస్తాలో స్వీట్లు పంచి టపాకాయాలు కాల్చారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, మహేందర్, హరీష్, నర్సింహులుగౌడ్, సత్యం, రాఘవేందర్, శ్రీను, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

శంకర్‌పల్లి చౌరస్తాలో..

శంకర్‌పల్లి: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుపై మంగళవారం సాయంత్రం శంకర్‌పల్లిలో బీజేపీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఒకరికొకరూ స్వీట్లు తినిపించుకుంటూ, పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. జై మోదీ, జై కొండా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు సురేశ్, రాములు, వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

డీకే అరుణమ్మ గెలుపుపై హర్షం

కొందుర్గు: కొందుర్గు: మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణమ్మ గెలుపు పట్ల కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాండ్ మేళాలతో ర్యాలీలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల అధ్యక్షులు శ్రీశైలం, కుర్మయ్యలతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

స్వీట్లు పంచుతూ..

కేశంపేట: మహబూబ్‌నగర్ ఎంపీగా బీజేపీ నుంచి బరిలో నిలిచిన డీకే అరుణ గెలుపొందడంపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీజేపీ నాయకులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, నాయకులు మోటె శ్రీనివాసులు, శివాజీ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్‌లో స్వీట్లు పంచుకుంటున్న నాయకులు


షాబాద్‌లో..


కేశంపేట: మండల కేంద్రంలో..

కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ జాతర


ఆలయం వద్ద భక్తుల సందడి

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ శివారులోని రేణుకా ఎల్లమ్మ అమ్మవారి జాతర కొనసాగుతోంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తాండూరు ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు బోనాలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జాతరలో భాగంగా ఈ నెల 7వ తేదీన అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు.

వాన దేవుడే దిక్కు

- నీరు లేక ఎండిన చెరువులు
- మరమ్మతులకు నోచుకోక బోసిపోయిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కొడంగల్ : నియోజకవర్గంలోని నోటిఫైడ్ చెరువులు, కుంటలకు మరమ్మతులు లేక బోసిపోయాయి. సాగునీరు లేక ఆయకట్టు భూములు బీడుగా మారాయి. నియోజకవర్గంలో 461 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఆయా చెరువుల కింద వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయినా పంటలు పండక పొలాలు ఎడారిని తలపిస్తున్నాయి. వర్షాధార పంటలపై ఆధారపడి ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేస్తున్నారు. కొంతమంది రైతులు బోర్లు వేసుకొని పంటలు పండిస్తున్నారు. కురిసిన కొద్దిపాటి వర్షం నీరైనా చెరువుల్లోకి వచ్చి చేరుతుందా అంటే కష్టమే. నోటిఫైడ్ చెరువులు.. కుంటల్లో మట్టి పేరుకుపోయింది. పాటు కాల్వలకు మరమ్మతులు లేవు. వరదనీరు చెరువుల్లోకి వచ్చే పరిస్థితి లేదు. నియోజకవర్గంలో మిషన్‌కాకతీయ పనులు నామమాత్రంగా జరగడంతో రైతులు నష్టపోయారు. నిజాంకాలంలో నిర్మించిన చెరువులకు మరమ్మతులు చేయకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. నియోజకవర్గంలో అధికంగా హస్నాబాద్ చెరువుకు 950 ఎకరాల ఆయకట్టు, కొడంగల్ చెరువుకు 550 ఎకరాల ఆయకట్టు ఉంది. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లోని పెద్ద చెరువులు నిండడం లేదు. దీంతో పంటలు పండడం లేదు. కొడంగల్ మండలంలో 5 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. వందలాది మంది రైతులకు చెరువుల కింద ఆయకట్టు భూములు ఉన్నాయి. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పనులు నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో జరగలేదు. చెరువుల్లో పనులు పూర్తి కాక పోవడంతో నీటి నిల్వలేక వెలవెలబోతున్నాయి.


కొడంగల్ చెరువుకట్టపై నెర్రెలు